## మంచి వార్త

# పర్యావరణ విజేత.. వినీత



**గిరిజన** యువతి పంగి వినీతకు వ్యవసాయమే ప్రాణం. పొద్దున్నుంచి సాయంత్రం దాక పొలంలోనే గడుపుతుంది. అందాల అరకులోయలోని ఆ వ్యవసాయ క్షేత్రాలు ఆమెకు జీవనాధారం. కాదు కాదు, సర్వస్వం. వినీత సొంతూరు అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగూడ మండలం బలియగూడ. సుస్థిర, సేంద్రియ విధానాలు అనుసరించినందుకు ఆమెకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా అవార్డు ఇచ్చింది. హానికర రసాయనాలు వాడకుండా నేల నుంచి పంటను తీసుకోవడమే నేలతల్లికి మనం తిరిగిచ్చే కానుక అని వినీత ప్రగాఢ విశ్వాసం. భర్త బాలకృష్ణతో కలిసి ఆయా రుతువులను బట్టి కాఫీ, కూరగాయలు, జొన్నలు, మిరియాలు, పప్పుధాన్యాలు సాగు చేస్తుందామె. ఇక పంటల నాణ్యతను పెంచడానికి ఈ దంపతులు సేంద్రియ ఎరువులు చల్లుతారు. నీటి సంరక్షణ విధానాలను అనుసరిస్తారు. ‘‘మేం ఎలాంటి రసాయనాలను ఉపయోగించం. కారణం, అవి నేల కాలుష్యానికి దారితీస్తాయి. ఒక్క నేలకేనా.. పంటలకు, మనిషికి కూడా అనారోగ్యకరమే. ఆవుపేడ, గోమూత్రం నుంచి తయారు చేసే సేంద్రియ ఎరువులను మా పొలంలోనే తయారుచేసుకుంటాం’’ అంటారు వినీత, బాలకృష్ణ దంపతులు. ఈ విధానం అత్యుత్తమమైంది మాత్రమే కాదు, పంటనూ భూమినీ ఆరోగ్యకరంగా ఉంచుతుంది. దుంబ్రిగూడలోనే ఉన్న కిల్లోగూడలో జరిగిన 15వ నూనెగింజల ఉత్సవంలో వినీత ‘ఉత్తమ రైతు’ పురస్కారం కూడా అందుకున్నారు. గిరిజన రైతులు స్థానిక విత్తనాల పరిరక్షణ ప్రాధాన్యాన్ని గుర్తించడానికి నిర్వహిస్తున్న సంప్రదాయ కార్యక్రమమే ఈ నూనెగింజల ఉత్సవం. ప్రజల అనారోగ్యానికి ప్రధాన కారణం రసాయన ఎరువులు, హానికరమైన పురుగుమందుల సేద్యమే. ఇలాంటి పరిస్థితుల్లో ప్రకృతికి మేలుచేసే సేంద్రియ విధానాలను అమలుచేయడం అందరికీ మంచిది. ఈ క్రమంలో వినీత, బాలకృష్ణ దంపతుల వ్యవసాయ విధానాలు అందరూ అనుసరించదగినవి.

## వైతాళికుల వాణి

శాంతియుత సహజీవనం,
స్వేచ్ఛ, బాధల నుంచి విముక్తి,
ఉత్పత్తిదాయకమైన జీవనం
ప్రతి ఒక్కరి హక్కులు.

• **జిమ్మీ కార్టర్**

**అమెరికా మాజీ అధ్యక్షుడు**

**(డిసెంబర్ 10 మానవ హక్కుల దినం)**

## క్యా బాత్‌హై!

